క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

షాద్‌నగర్: వానాకాలం పంటల సాగుపై శనివారం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏడీఏ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశం పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరు కానున్నట్లు తెలిపారు. డీలర్లు విధిగా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

వచ్చే నెల 5న సామూహిక ఉపనయనాలు

షాద్‌నగర్: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో జూన్ 5న సామూహిక ఉపనయనాలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గౌరవరాజుల వెంకటేశ్వర్ రావు, నాయకులు రాజ్‌గోపాల్, పూర్ణచందర్ రావు, మధుసూదనాచార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రామ్‌మందిర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 5గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా పూజా సామగ్రి, దుస్తులు, భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉపనయనాలు చేయదలుచుకున్న వారు ఈనెల 31వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ!



నసురుల్లాబాద్ ప్రాథమిక పాఠశాల

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లి అనుబంధ గ్రామం నసురుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనందున అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించడంతో పాటు, మరుగుదొడ్లు మరమ్మతు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో శుక్రవారం టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విచ్చేశారు. టీబీ అలర్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు గోధుమపిండి, బియ్యం, కందిపప్పు, బెల్లం, పల్లీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ విష్ణు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది రవికుమార్, షఫీ, సంధ్య, అన్వర్, లింగం, గౌస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



మృతిచెందిన గేదెను పరిశీలిస్తున్న స్థానికులు

కొందుర్గు: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని విశ్వనాథ్‌పూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుండేటి శ్రీరామ్‌రెడ్డికి చెందిన పాడిగేదె శుక్రవారం ఉదయం పొలం వద్ద మేత మేస్తుండగా కరెంట్ షాక్‌కు గురైంది. దీని విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోండి

మంచాల: మంచాల పీఏసీఎస్ బ్యాంకులో రుణమాఫీ వర్తించని రైతులు.. వారం రోజుల వ్యవధిలో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్‌లో చాలా మంది రైతుల వివరాలు తప్పుగా నమోదు కావడంతో మాఫీ కాలేదని పేర్కొన్నారు. లబ్ధి పొందని వారు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్లు, పట్టా పాసుపుస్తకాల జిరాక్స్‌లు అందించాలని సూచించారు.



కుత్బుద్దీన్‌గూడలో అధ్వానంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ



మేడిపల్లిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నుంచి లీకవుతున్న మురుగునీరు

దారి తప్పిన పారిశుద్ధ్యం

- రోడ్లపైనే పారుతున్న మురుగు
- కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పత్తాలేని ప్రత్యేక అధికారులు
- అవస్థల్లో గ్రామీణ ప్రజలు

మొయినాబాద్: పంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేక అధికారుల పాలనలో కాలనీలు కంపుకొడుతున్నాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా.. రోడ్ల పక్కన చెత్తాచెదారం నిండిపోయినా పట్టించుకునేవారు లేరు. మొయినాబాద్ మండలంలోని మేడిపల్లి, కుత్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, చందానగర్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లపై మురుగు పారుతోంది. కొన్ని చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లుతున్నాయి. ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసి సుమారు ఏడాదిన్నర కావస్తోంది.. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడు ప్రజలు వారి సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేదు. ఈ బాధ్యతలు తీసుకున్న స్పెషల్ ఆఫీసర్లు ఎక్కడ ఉంటారో కూడా తెలియడం లేదని జనం ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడు?



శంకర్‌పల్లి చౌరస్తాలో రోడ్డుపై నిలబడిన కూలీలు

శంకర్‌పల్లి: పట్టణం నడిబొడ్డున ఉదయం పూట వందలాది మంది కూలీలు రోడ్డుపైకి వచ్చి నిలబడుతున్నారు. దీంతో రహదారి సగం మేర రాకపోకలు సాగించలేకుండా నిండిపోతోంది. ఫలితంగా శంకర్‌పల్లిలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు ఉన్న రోజుల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పోలీసులు, అధికారులు పరిష్కారం చూపడం లేదు. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం ఉదయాన్నే రోడ్లపైకి వెళ్తున్న వారికి ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ అంశంపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

‘సర్కారు బడిలో మా పిల్లలను చేర్పిస్తాం’



మనబడి కార్యక్రమంలో ముస్లింలు

మంచాల: ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పిస్తామని పలువురు ముస్లింలు ప్రకటించారు. శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన మనఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చౌరస్తాలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల పాఠశాలను దత్తత తీసుకొని రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, బంగారు భవిష్యత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆరుట్ల పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు కంభాలపల్లి భాస్కర్, మండల మాజీ కో– ఆప్షన్ సభ్యులు ముస్లిం నాయకులు ఖలీల్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.90 లక్షల విరాళం



దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చేవెళ్ల: తంగడపల్లిలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన శ్రీధర్, పద్మజ దంపతులు రూ. 2.90 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- కేశంపేట ఎంపీడీఓ కిష్టయ్య
- పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



పాపిరెడ్డిగూడలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కేశంపేట: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యంగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ కిష్టయ్య లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని నిర్దవెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, గ్రామస్తులతో కలిసి శుక్రవారం ఆయన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. కొండారెడ్డిపల్లిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, పాపిరెడ్డిగూడలో మాజీ సర్పంచ్ శివయ్య, బోధునంపల్లిలో మాజీ ఉప సర్పంచ్ నీల పాండు ఇందిరమ్మ నిర్మాణాలను ప్రారంభించారు. నిర్దవెల్లిలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. విడతల వారీగా ఇళ్ల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమవుతాయని స్పష్టంచేశారు. మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మొద్దని సూచించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు గుండే రాణి, అబ్బి సుందరయ్య, చెవెళ్ల నర్సింలు, తాండ్ర కృష్ణారెడ్డి, సత్యంగౌడ్, ప్రభాకర్‌జీ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత జోడించి బోధన చేపట్టాలి



నందిగామ: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాబాద్: మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: విద్యార్థులకు నాణ్యమైన, సాంకేతికతతో కూడిన విద్యను అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. నందిగామ జిల్లా జెడ్పీహెచ్‌ఎస్‌లో కొనసాగుతున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించినట్లయితే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పరీక్షల్లో సులభంగా రాణిస్తారని చెప్పారు. సర్వేంద్రిగూడ, శ్రీనివాసులుగూడ, నసురుల్లాబాద్ పాఠశాల భవనాలకు వీలైనంత తొందర్లో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిందని త్వరితగతిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రాఘవేందర్, జ్ఞానేశ్వర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్, ఖలీమ్, రిసోర్స్‌పర్సన్‌లు కార్యనాయక్, గణేష్, సరిత, బాలకృష్ణ, సబిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు:ఎంఈఓ లక్ష్మణ్

షాబాద్: ఉపాధ్యాయులు కొత్త విషయాలపై అవగాహన పొందుతూ నిత్య విద్యార్థులుగా ఉండాలని షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాద్‌నగర్‌లో షాబాద్ మండలానికి చెందిన ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్లు అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం శిక్షణ శిబిరానికి వెళ్లిన ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను విద్యాబోధనలో వినియోగించాలని సూచించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంతో పాటు ఉపాధ్యాయుల సామర్థ్యంపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

‘సకాలంలో ధాన్యం కొంటున్నాం’



రైతులకు భోజనం వడ్డిస్తున్న శ్రీశైలం

ఆమనగల్లు: రైతులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గింజ సేకరిస్తామని, రైతులు దళారులకు ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నాలకు రూ.500 బోనస్ తీసుకోవాలని కోరారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో చైర్‌పర్సన్ యాట గీత ఏర్పాటు చేసిన రైతులకు ఉచిత భోజన వసతి కార్యక్రమాన్ని శ్రీశైలం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సిబ్బంది వినోద్, కిరణ్, శరత్, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్, గౌస్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి నేత్రాలు దానం



మాధవి(ఫైల్)

ఆమనగల్లు: గుండెపోటుతో మృతిచెందిన వివాహిత మాధవి కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. హైదరాబాద్‌లోని మారుతీనగర్‌కు చెందిన ఆమె గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు అర్ధం మనోహర్, పీఆర్‌టీ పాషా తదితరులు మాధవి భర్త అశోక్‌తో పాటు విదేశాల్లో ఉన్న ఆమె కుమారులను ఫోన్‌లో సంప్రదించారు. నేత్రదానం చేయాలని కోరడంతో కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకరించారు. దీంతో ఎల్‌వీప్రసాద్ ఆస్పత్రి వైద్యులు మాధవి కళ్లను సేకరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్చకులు శ్రీనివాసమూర్తి, నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి, మహాగణాధిపతి, జయ విజయుల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఉత్సవానికి జూలపల్లి గ్రామ ప్రజలు తలంబ్రాలతో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మార్కెట్ చైర్‌పర్సన్ గీత, పీసీబీ సభ్యుడు బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తలకొండపల్లి సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాములు, నాయకులు జైపాల్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, శ్రీను, యాదయ్య, రాజేందర్‌రెడ్డి, అజీజ్, రేణురెడ్డి, అంజయ్య, శ్రీశైలంగౌడ్, రాఘవేందర్‌గౌడ్, విష్ణు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శిరీష, సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి



నందిగామ: బుగ్గోనిగూడలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుకుమార్

షాబాద్: రైతులు పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి లన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, హైతాబాద్ గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేతలు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి, పత్తి, కందులు, మొక్కజొన్న పంటలల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, ఒకేసారి కాకుండా దఫాలుగా వేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రైతులు పండిస్తున్న ప్రధాన పంటల మార్కెటింగ్ గురించి వివరించారు. రైతు సమాఖ్య సంస్థలను స్థాపించాలని కోరుతూ అవసరమైన ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఏఓ వెంకటేశం, విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్స్ అవనిజ, వ్యవసాయ విద్యార్థులు ప్రవీణ్ కుమార్, శివ, ఏఈఓలు రాజేశ్వరి, కిరణ్మయి, ప్రవీణ్‌కుమార్, స్నేహ, రైతులు మాణిక్యరెడ్డి, శశికాంత్ రెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణ, తదితరులున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

నందిగామ: రసాయన ఎరువులను వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త సుకుమార్ సూచించారు. మండల పరిధిలోని బుగ్గోనిగూడలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి శివరామరావు ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్త రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అవసరమైన మేరకే పంటలకు యూరియాను ఉపయోగించాలని, నాణ్యమైన విత్తనాలు నాటాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రశీదు తప్పక తీసుకోవాలని సూచించారు. పంట మార్పిడితో అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని, నేల స్వభావాన్ని బట్టి పంటలను, ఎరువులను వేయాలని చెప్పారు. శివరామరావు మాట్లాడుతూ.. వేసవి దుక్కులు దున్నినట్లయితే పంటకు ముందే పురుగునివారణ చేపట్టవచ్చన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డాక్టర్ స్నేహలత, ఏఈఓ రవి, అగ్రికల్చర్ విద్యార్థులు స్వాతి శ్రీ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి

శంకర్‌పల్లి: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శంకర్‌పల్లి మండలంలోని చెందిప్ప, టంగటూరు గ్రామాల్లో పర్యటించి, రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. పొలాల్లో అవసరానికి అనుగుణంగానే యూరియా వాడకం చేయాలని, మితిమీరిన రసాయనాల వల్ల నేల కలుషితం అవుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు.. కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ప్రమీల, ప్రొఫెసర్లు హరీశ్ కుమార్ శర్మ, లక్ష్మీ చల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహలత, మండల వ్యవసాయాధికారి సురేశ్ బాబు, ఏఈఓ మనీషా, రామకృష్ణారెడ్డి, పీహెచ్‌డీ విద్యార్థులు గిరిబాబు, హారిక తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: హైతాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శిరీష



శంకర్‌పల్లి: చెందిప్పలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ప్రమీల

కళాశాలల మూసివేతతో విద్యార్థులకు నష్టం

తుర్కయంజాల్: రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన పేద విద్యార్థులు నష్టపోతారని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలు, జేఈఈ తదితర పరీక్షల్లో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలతో పోటీపడి విద్యార్థులు ర్యాంకులు సాధించారని గుర్తుచేశారు. విద్యార్థులు చేరడం లేదనే సాకుతో మూసివేయడం కంటే, మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం అందించి, అధ్యాపకులను నియమిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాల విద్యలో 10,159 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని కోరారు.

మెడికల్ కిట్ల పంపిణీ



ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన మెడికల్ కిట్లను శుక్రవారం గర్భిణులకు బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, రాజు, కృష్ణయ్య, శరత్‌చంద్ర, అనిల్, రాజు, మల్లేశ్‌గౌడ్, విజేందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.